

నేను ఘనీభవిస్తే ఒక నామారూపాత్మక దేహం
నేను ద్రవీభవిస్తే ఒక జ్ఞాపకాల ప్రవాహం...
- గుంటూరు శేషేంద్ర శర్మ

# జనస్వరం

అక్షరమే ఆయుధం

www. Janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.

సంపుటి : 01 సంచిక : 25 ఎడిటర్ : నరేష్ సాకే వారసంచిక ( 27-12-2020 ) పేజీలు : 6

/ janaswaramNEWS / 9642067900


జనస్వరం వెబ్ మీడియా మరియు 25 వార్తా సంచికలను ఆదరించిన ప్రతి ఒక్కరికీ నమాశ్శీస్సులు.

## ప్రచారం కోసం చట్టాలు చేస్తే మహిళలకు రక్షణ దొరుకుతుందా?

### దిశ చట్టాన్ని ప్రచారానికి వాడుకున్నారే తప్ప ప్రయోజనాలు అందించలేదు.




న్యూస్ ( జనస్వరం) : మహిళల రక్షణ కోసం దిశ చట్టం చేశాం... నేరం చేసినవారికి 21 రోజుల్లో శిక్ష పడుతుంది అంటూ ప్రచారం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆచరణలోమాత్రంఒక్కఅడుగు కూడా ముందుకు వేయలేదు. సరికదా మైనర్ బాలికలు, విద్యార్థినులు, యువతులు, మహిళలపై అఘాయిత్యాలు, దాడులు ఆగలేదు. ఉన్మాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం ఉండటం లేదు. విజయవాడలో రెండు ఘటనలు, గాజువాకలో ఒక ఘటనలో యువతులు మృగాళ్ల చేతుల్లో హత్యకు గురయ్యారు. ఇప్పుడు అనంతపురం జిల్లా ధర్మవరంలో స్నేహలత అనే పేద దళిత యువతి హత్యకు గురవడం అత్యంత బాధాకరం. ఈ ఘటన పూర్వాపరాలను అనంతపురం జిల్లా జనసేన నాయకులు తెలియచేశారు. పేద కుటుంబానికి చెందిన స్నేహలత వేధింపులు భరించలేక చదువు మధ్యలోనే విడిచిపెట్టి చిన్నపాటి ఉద్యోగంలో చేరిందని తెలిసింది. తమ బిడ్డను వేధిస్తున్నారు... మా ఇంటి ముందుకు వచ్చి భయపెడుతున్నారు అని పోలీస్ స్టేషనుకు వెళ్తే అధికారులు ప్రవర్తన ఆ తల్లితండ్రులను మరింత కుంగదీసింది. 'అక్కడి నుంచి ఇల్లు మారిపొండి' అని పోలీసు సలహా ఇవ్వడం చూస్తే ఆ వ్యవస్థ ఎంత బాధ్యతా రాహిత్యంతో ఉందో అర్థం అవుతోంది. వ్యవస్థల వైఫల్యం వల్లే స్నేహలత ఇద్దరు దుర్మార్గుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలి. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలి. చిత్తశుద్ధి లేకుండా ప్రచారం కోసం చట్టాలు చేస్తే ఎంత మాత్రం ప్రయోజనం ఉండదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ దిశ చట్టమే. దిశ చట్టం వచ్చి ఏడాది అయింది. చట్టం చేయగానే పాలాభిషేకాలు చేయించుకొని.. ( మిగతా 4 లో )

## సమస్యను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ జనసేన నాయకులు



విశాఖపట్నం ( జనస్వరం ) : విశాఖలో ఇండస్ట్రియల్ ప్రజలు అలాగే, గాజువాక ప్రజలు విశాఖపట్నం సిటీకి చేరుకోవాలంటే అతి సులువైన మార్గము కాన్వెంట్ రోడ్డు మార్గము. అయితే Essar కంపెనీ నుంచి కాన్వెంట్ కి వెళ్ళే దారిలో పెద్ద పెద్ద టిప్పర్లు కెమికల్స్, మినరల్స్ తీసుకువెళుతూ కవర్ కప్పకుండా రోడ్డు మీద జల్లుతూ వెళ్లడంతో ఇబ్బందిగా మారిందని పశ్చిమ నియోజకవర్గ జనసైనికులు అన్నారు. ఈ చలికాలంలో మంచు వల్ల రోడ్లు జారిపోతున్నాయి. అటుగా టూ వీలర్ మీద ప్రయాణిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా ( మిగతా 4 లో )

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసైనికుడి కుటుంబానికి ఎన్.ఆర్.ఐ. జనసేన రూ. 4,16,224 ఆర్థిక సాయం



గుంటూరు ( జనస్వరం ) : గుంటూరు జిల్లా గురజాలనియోజకవర్గంలోఇటీవలమృతిచెందిన జనసేన కార్యకర్తలను స్మరించుకుంటూ స్థానిక పార్టీ శ్రేణులు సంస్మరణ సభ ఏర్పాటు చేశాయి. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది జనసైనికులు రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న నేపథ్యంలో అంతా స్వీయ భద్రత పాటించాలని దిశానిర్దేశం చేశారు. మృతి చెందిన జనసైనికుల సేవలను స్మరించుకున్నారు. గురజాల నియోజకవర్గం దాచేపల్లికి చెందిన జనసైనికుడు మునగా రవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎన్.ఆర్.ఐ. జనసేన యూ.ఎస్.ఎ. విభాగం అతని కుటుంబానికి అండగా నిలిచేందుకు పార్టీ తరఫున కొంత మొత్తాన్ని సేకరించి పంపారు. మొత్తం రూ. 4,16,224 ను చెక్ రూపంలో సంస్మరణ సభలో పార్టీ నాయకుల చేతుల మీదుగా మృతుని తల్లికి అందచేశారు. ఆ కుటుంబానికి పార్టీ తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.. కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్రా సంయుక్త కమిటీ సభ్యులు గాదె వెంకటేశ్వరరావు, పాకనాటి రమాదేవి, చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన నాయకులు శ్రీ తన్నీరు కిషోర్ మరియు స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపురం జిల్లా ధర్మవరం మండలంలో దారుణ హత్యకు గురైన SBI కాంట్రాక్టు ఉద్యోగిని స్నేహాలత మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి న్యాయం జరిగేలా, నిందితులకు శిక్ష పడేలా పోరాడుతామని భరోసా ఇచ్చిన జనసేన పార్టీ PAC సభ్యులు మధుసూదన్ గారు, TC వరుణ్ గారు మరియు జనసైనికులు

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు : బాపట్ల జనసేన నాయకులు




బాపట్ల ( జనస్వరం ) : అనంతపురం జిల్లా ధర్మవరం మండలం లో రాక్షసుల చేతిలో బలైన అమ్మాయి. ప్రచార ఆర్భాటాలతో పరిమితమైన చట్టాలు. ఒక మహిళ హోం మంత్రిగా పనిచేస్తున్న ఇలాంటి సంఘటన జరగడం మన దౌర్భాగ్యం. నేను ఉన్నాను నేను విన్నాను అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటూ ఏ ఒక్క మహిళ కు అన్యాయం జరగనివ్వం అంటూ దిశా చట్టం చేసిన ఈ ప్రభుత్వానికి మహిళల పై జరుగుతున్న అగత్యం పై దిశ చట్టం ఏమాత్రం పనిచేయట్లేదు. అంటే ప్రభుత్వం మహిళలపై ఎంత బాధ్యతగా వ్యవహరిస్తుందో తెలుస్తుంది . ఇప్పటికైనా కళ్లు తెరిచి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారు మరియు హోమ్ మంత్రి సుచరిత గారు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ డిమాండ్ చేస్తుంది. దిశ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన పట్టించుకోని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము అని జనసేన నాయకులు అన్నారు

## ఈ నెల 28న కృష్ణా కలెక్టర్ కు వినతి పత్రం అందించనున్న శ్రీ పవన్ కళ్యాణ్ గారు

న్యూస్ ( జనస్వరం ) : నివర్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు 35 వేల రూపాయలు పరిహారంగా అందించాలని, తక్షణ సాయంగా పది వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 28 వ తేదీన కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ ఏ.ఎం.డి.ఇంతియాజ్ గారికి జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు వినతి పత్రం అందచేయనున్నారు. 28 న ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి గుడివాడ, పెడన మీదుగా మచిలీపట్టణం చేరుకుంటారు. అనంతరం కలెక్టరేటులో కలెక్టర్ గారికి వినతి పత్రం అందచేస్తారు. రైతులు, కౌలు రైతుల ఉజ్వల భవిష్యత్తు కోసం జనసేన తలపెడుతున్న జైకిసాన్ కార్యక్రమంలో భాగంగా అదే రోజున రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాలలో జనసేన నాయకులు ఆయా జిల్లాల కలెక్టర్లకు నివర్ బాధిత రైతులు పక్షాన విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్నీ జిల్లాల్లో జనసేన నాయకులు, జనసైనికులు విజయవంతం చేయాలని కోరారు.

# " వ్యవస్థ కోసం ప్రణాళిక "

## సంపాదకీయం




సామాజిక రుగ్మతలతో పోరాడాలనుకునే ఒక ప్రణాళిక, ఆ ప్రణాళికను నెరవేర్చే తీరులో జరిగే అలసట, వాటి సమూల ప్రక్షాళనను చేపట్టడంలో ఉండే దీక్ష, ఒక రాజకీయ పార్టీకి అపాదించగలమా అనే భావన కలిగినప్పుడు మనసు ఎంత నిరుత్సాహ పడుతోందో అవగాహన ఉన్న ప్రతీ వ్యక్తికి తెలుస్తుంది. ఉద్దేశ్యం వెనుకగల సంకల్పం ఎంత బలమైనదై ఉండాలో కూడా లోతులలోకి వెళ్ళి ఒకసారి మనల్ని మనం విమర్శించుకుంటే తెలుస్తుంది. ఎన్నో రాజకీయ పార్టీల ఉనికి పోరులో సిద్ధాంతాలు ఆటకెక్కి పోతున్న ఈ రోజుల్లో సిద్ధాంతమే ముఖ్యం, గెలుపు సిద్ధాంతానికే గాని పార్టీకి కాదనే భావజాలం కలిగిన పార్టీ ఏదైనా ఉందా అంటే చెప్పగలరా ఎవరైనా..!!?? మరొకరు చెప్పినా ఒప్పుకోగలరా..?? ఎందుకంటే పూర్తిగా రాజకీయ విధానాలను చూసిన పౌరుడు నమ్మడం మానేసి తనకి లబ్ధి చేకూరే విధంగా ఏ పార్టీ ఉంది అనే కోణంలో ఆలోచించి పూర్తిగా దేశ, రాష్ట్రాల క్షేమాన్ని తుంగలోతొక్కి భవిష్యత్తు తరాల వారి స్వాతంత్ర మూలాలను పణంగా పెట్టి ఒక నిర్లిప్త ధోరణిలో ఆశ వదులుకుని బ్రతుకుతున్నాడు. ఈ ప్రమాదకరమైన అంశం ఆలోచించే పౌరులు ఎంత మేరకు సమాజం కోసం ప్రతిఘటిస్తున్నారనేది ఆలోచించాల్సిన విషయం.

ఇంతటి ప్రమాదకరమైన స్థితిలోనికి నెట్టి వేయడానికి బలమైన కారణాలు : కులం, మతం, సాంప్రదాయాలు, భాష సంస్కృతి పట్ల అవగాహనా లోపం, జాతీయత, ప్రాంతీయతల మధ్య జరిగే సంఘర్షణ, అవినీతి, పర్యావరణంపై చిన్న చూపు.

పైన పేర్కొన్న ఈ ఏడు విషయాలు వ్యక్తిని గొప్ప వ్యవస్థలో మనగలిగే శక్తిగా తీర్చిదిద్దుతాయనే విషయం ప్రతీ ఒక్కరూ గుర్తించాలి. వీటిపై పాలకుల తీరే నేటి భవిత అని ప్రతీ పౌరుడూ గుర్తిస్తే సమాజం ఉన్నతమైన స్థానానికి వెళ్ళే దారి దొరుకుతుంది. పర్యావరణాన్ని పాడుచేసి, అవినీతితో దేశ సంపదను బొక్కేస్తూ, ప్రాంతీయతల మధ్య చిచ్చులో చలికాచుకుని జాతీయతను విస్మరించి భాష సంస్కృతి సాంప్రదాయాలను భేఖాతరు చేసి వాటి మూలాల్లో ఉండే క్రమశిక్షణను విడిచిపెట్టి మతం నీడలో కులం మత్తులో ఉండిపోతున్న పౌరుడు ఎప్పటికి కళ్ళు తెరుచుకొని ఈ జాతి కోల్పోయేదేమిటో ఎప్పుడు గ్రహిస్తాడు..?? వాటి ఉనికిని పరిచయం చేసే వాడికి ఎప్పుడు మద్దతు ప్రకటిస్తాడు..??

సాంప్రదాయ పునాదులే మన దేశాన్ని ప్రపంచ దేశాలలో విభిన్నంగా చూపిస్తూ గౌరవ మర్యాదలకు ఆలవాలమే దేశ విశిష్టతను చాటుతోంది. వాటిని విస్మరించి పాశ్చాత్య సంస్కృతి మోజులో శల్యపరీక్షను విడిచిపెట్టి ఇప్పుడు జరుగుతున్న నూతన పోకడలు మన పునాదులకే పరీక్ష పెడుతున్నాయి. సాంప్రదాయంలో ఇమిడి ఉన్న లోతైన ధర్మగుణం విధానాలు, స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం కలగలిసిన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని మనమే చేతులారా నాశనం చేసుకుంటూ, వ్యక్తి జీవనశైలి వ్యవస్థ జీవనశైలికి దర్పణం అని చెప్పే అర్థవంతమైన విషయంగా సమాజానికి చూపలేకపోతున్నాం.

ఎదుటి వ్యక్తి ఆచారాన్ని అందులో నున్న నిగూఢాన్ని గ్రహించలేని స్థితిలో మన జాతి ఉందంటే ఏ సంస్కృతి మూలాలతో అలరారే ఖజానాను విస్మరించి చిందులు వేస్తుందో, అందులో దొరికే మానసిక వికాసమేమిటో ఇప్పటి తరం వారు ప్రశ్నించుకోవాలి. వ్యక్తి అంటే వ్యవస్థలో భాగమే, నీవు అలవరుచుకున్న విధానాలే నిన్ను ఉన్నత స్థితికి తీసుకువెళ్తాయి.. నీ వ్యక్తిగత విషయంగా పరిగణించే ఏ విషయమైనా సమాజంలో ఏ ఒక్కరికీ హాని తలపెట్టేది కానిదైతే చాలు.. దాని వలన భవిష్యత్తులో నువ్వు ఎదుర్కొనే సమస్యలకు నువ్వే జవాబు చెప్పుకోలేని పరిస్థితి రాకుండా ఉంటే చాలు.

### " కులాలను కలిపే ఆలోచనా విధానం.."

ప్రకృతి శక్తులకు కులం లేదు కానీ వాటి మీద ఆధారపడి బ్రతికే మనిషి అశాశ్వతమైన తన ఉనికికి కులం ఆపాదించుకున్నది ఒకరిపై ఒకరు ఆధారపడి బ్రతకమని తప్ప ఒకరిపై మరొకరి పెత్తనం చెయ్యమని కాదు. ఇది అలా క్రమేపీ సామాజిక వ్యవస్థ నుండి మనిషి ఆర్ధికపరమైన విషయంగా ముడిపడిపోయేసరికి దీని ఉద్దేశ్యంలో వైరుధ్యము సంతరించుకుని ఆ కులం ముసుగులోనే సమాజాన్ని ఒక అస్తవ్యస్తమైన స్థితిలోకి నెట్టివేసింది.

స్వాతంత్ర్యం రాక మునుపు వరకూ ఈ కుల వ్యవస్థలో ఎన్నో రకాలైన ఆర్ధిక, మానసిక అంశాలు చాలా వరకూ స్నేహాన్ని, సహృద్భావాన్ని కోల్పోయే పరిస్థితిని తీసుకువచ్చాయి. ఈ పరిస్థితులే నేటికి లేకపోయినా గతం మాత్రమే దృష్టిలో ఉంచుకుని ఎన్నో రకాలైన ప్రత్యేక చట్టాలు, అలా వెనకబడిన వారి సంక్షేమం కోసం ఎన్నో రకాలైన కుల కార్పొరేషనల్ల విధానాలు, రిజర్వేషన్ల కల్పన జరిగింది. కానీ దీని ఉనికి చావులేదు.. ఎందుకంటే ఈ అంశం వారి ఉన్నతి కన్నా వారి ఉనికే ప్రధానంగా మారడమే కారణం. నిజం నిష్టూరమైనా అది ఒప్పుకోక తప్పదు..!

కులం పేరు మీద అన్యాయమవుతున్న జాతి ఏదైనా ఉంటే అది భారతజాతి.., ఎన్నాళ్ళు ఇలా కులానికి ప్రోత్సాహకాలు యిస్తే జీవన విధానం మెరుగు పడుతుంది అనే కోణంలో ఏ ఒక్కరూ ఆలోచించకపోవడం, ఇదే పరిస్థితి రేపు మరొకరికి ఎదురైతే వారు కూడా మేము అణగారిన వారమే అని అంటే ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఏమీ సమధానం చెప్ప లేకపోవడం కూడా జరుగుతుంది. ఆ పరిస్థితిని ఈ రాజకీయ నాయకులు వారి స్వార్ధం కోసం పెంచి పోషిస్తున్నారు. కులం నీడలో ఎదగాలనే ఈ సామాజిక కోణంపై ఎంత త్వరగా ఈ చట్టసభలు ఉద్వాసన పలికే నిర్ణయం ప్రకటిస్తే దేశానికి అంత మంచిది. కనీసం ప్రాంతాల వారిగానైనా చేపట్టి దీనికి ముక్కుతాడు వెయ్యకపోతే ఎంతో మంది జ్ఞాన సంపద దేశానికి పనికి రాకుండా పోతుంది.

### "మతాల ప్రస్తావన లేని రాజకీయం.."

దేశం మగ్గిపోతున్న అత్యంత హేయమైన చర్యలలో ఇది మరింత జుగుప్సాకరమైన కోణం. ధర్మాన్ని మించిన మతం ఉందా..?? మానవత్వాన్ని మించిన దైవం ఉందా..?? మతం అంటే మనిషిపై మనిషి చూపాల్సిన మానవత్వం. పరమత సహనమనే మాటను పూర్తిగా విస్మరించిన నేటి సమాజం మతం నీడలో ప్రత్యేకత సంతరించుకోవాలనే మూఢత్వంగా పరిణమించింది.. ఎన్నో శతాబ్ధాల చరిత్ర కలిగిన దేశ హైందవ సంస్కృతి పై కూడా ఈ మత పరమైన మూఢత్వం వీడలేదు.. ఒక మతంలోనే ఎన్నో వర్గాలతో ఎవరికి వారు అన్యాయం చేసుకుంటున్న ఈ ఛాందస విధానాలు, రాజకీయ పార్టీలకు కూడా ఆపాదించే పరిస్థితి వచ్చింది. ఒక పార్టీకి మతం రంగు పూసిన తరువాత మరొక పార్టీ మిగిలిన వారికి వత్తాసు పలికినట్టేనా అని భావించడానికి కూడా వీలులేని స్థితిలోనికి మనిషిని తోసేసింది.. ఇంతా చేర్చి అదే మతం లోని వారికి ఒకరికొకరు సాయపడుతున్నారా అంటే అదీలేదు..!! అక్కడ వ్యక్తి స్వార్ధం మరలా తేటతెల్లమవుతుంది.. ఎన్నో దేశాలలో ఒకే మతంలోని వర్గాలకు సఖ్యత లేక నిరంతరం రక్తం పారుతూనే ఉంది. సాటి మనిషిపై మనిషి మానవత్వం ప్రదర్శిస్తే అదే దైవత్వం అని తెలియకుండా సామాజిక స్పృహ చంపేస్తున్నది ఎవరు..?? ఎవరు ఇదంతా చేస్తున్నారు..తరాలు ధర్మం కోసం పోరాడుతూ అలసి పోతుంటే మతం మాత్రం దాని విశృంఖలత్వాన్ని చూపిస్తూ నిశ్చేష్టులని చేస్తుంది.

### " భాషలను గౌరవించే సాంప్రదాయం.. "

ఇక్కడే దేశ సమైగ్రతకు కావాల్సిన వెన్న దొరుకుతుంది. బాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విడిపోయినా మనకి మాండలికాల ద్వారా స్వార్ధాన్ని చూపే చాంపల్యం వచ్చేసింది. ప్రతీ మాండలికం భాష ఔన్నత్యాన్ని చూపే సాధనమే. ఇక భాషకి భావమే మూలం..

నీవు పుట్టి పెరిగిన సమాజం నేర్పే నీ భాష, యాసలే నీవు అనుకుంటున్న భావాన్ని అందులో నుడిని గ్రహించగలవు. బలమైన ఆలోచనను చూపించగలవు. అరువు భాష బ్రతికేందుకు ఉపయోగపడుతుందేమో గానీ నీకు నువ్వుగా ఎదిగేందుకు నీ భాషే ఉపయోగపడుతుంది. భాషలపై గౌరవం ఉంటే నీ సాహిత్యం చెప్పే సూక్ష్మం, అది జగతికి నేర్పే ధర్మంపై అవగాహన వస్తుంది. ఏ భాషలోనైనా మనం పాండిత్యం సంపాదించాలన్నా నీ బాషపై నీకు పట్టు ఉండాలి. అదిలేనప్పుడు నీకు తెలిసిన భావన నిన్ను గొప్పగా చిత్రీకరించలేదు.. ఎన్నో రాష్ట్రాలలో భాషకు యిచ్చే ప్రాధాన్యత చూస్తే మన రాష్ట్రం దౌర్భాగ్య స్థితిలో ఉందని చెప్పొచ్చు. పాలకులే భాష యొక్క ప్రాధాన్యతను, దాని విశిష్టతను ప్రజలకు దూరం చేస్తామని పట్టుదలగా ఉంటే ఎవరికి మొర పెట్టుకుని దాని ఉనికికై పోరాడాలి..?? సాహిత్య సౌరభాలను వదిలేస్తున్న నేటితరానికి ఏమని హితభోధ చెయాలి..?? వ్యక్తిత్వవికాసాన్ని కాలరాసేసి గొప్పగా బ్రతుకుతున్నామనుకునే అల్పమైన స్థితిలోనికి నెట్టేస్తున్న ఈ పరిస్థితులను ఎలా ఎదిరించాలి..??

### " సంస్కృతులను కాపాడే సమాజం.."

ఆది నుండి మన సంస్కృతి నేర్పిన అంశం "ధర్మం". ఈ సంస్కృతిని మనం కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుంది. పాశ్చాత్య పోకడలు వ్యవస్థను నిర్వీర్యం చేస్తాయి అనేకన్నా.. ఆ పోకడలలోని పరిధులు దాటే విశృంఖలత్వం గమనించలేని భారతాన్ని ( మిగతా తరువాయి పేజీలో )

## ప్రచారం కోసం చట్టాలు చేస్తే మహిళలకు రక్షణ దొరుకుతుందా?

( మొదటి పేజీ తరువాయి )

కేకులు కోయించుకున్నారు. చట్టాన్ని మాత్రం ఆచరణలోకి తీసుకురాలేదు. ఆడ బిడ్డలపై పెట్రోలు పోసి నిప్పు పెట్టడాలు... కత్తిపోట్లు మాత్రం ఆగలేదు. ప్రచారం కోసం చేసిన ఈ చట్టం ఆడబిడ్డలకు ఏ విధంగా రక్షణ ఇస్తుందో ముఖ్యమంత్రి శ్రీ జగన్ రెడ్డి గారు, హోంశాఖ మంత్రి శ్రీమతి సుచరిత గారు ప్రజలకు సమాధానం చెప్పాలి అని పవన్ కళ్యాణ్ గారు డిమాండ్ చేశారు. ధర్మవరం మండలంలో దారుణ హత్యకు గురైన SBI కాంట్రాక్టు ఉద్యోగిని స్నేహలత మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి న్యాయం జరిగేలా.. నిందితులకు కఠిన శిక్ష పడేలా పోరాడుతామని జనసేన పార్టీ PAC సభ్యులు చిలకం మధుసూదన్ రెడ్డి గారు మరియు TC వరుణ్ గారు తెలిపారు.

## అవనిగడ్డలో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుకు జనసేన పార్టీ నాయకుల నివాళులు



అవనిగడ్డ ( జనస్వరం ) : అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని చల్లపల్లి మండలంలోని చింతలమడ గ్రామంలో సుధాని సాంబశివరావు(47సంవత్సరాల) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే.. సదరు రైతు 5ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట వేయడం జరిగింది. మొన్న వచ్చిన నివార్ తుపాన్ వల్ల నోటికాడికి వచ్చిన పంట నీటిలో మునిగి పోవటం వల్ల చేసిన అప్పులు ఎలా తీర్చాలి అనే ఆవేదనతో పురుగుల మందు తాగి బలవంతంగా తన ప్రాణం తీసుకోవడం చాలా బాధాకరమైన విషయం. రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకు నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకపోవడం చాలా సిగ్గుచేటు అయిన విషయం. జనసేనపార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు తక్షణ సహాయం క్రింద రైతులకు ఒక ఎకరాకు 10వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని నిరసన కార్యక్రమాలు రాష్ట్రం మొత్తం చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం. ఆరు మండలాల్లోని జనసైనికులు చింతలమడ గ్రామం వెళ్లి చనిపోయిన రైతు(సాంబశివరావు) భౌతికకాయంను సందర్శించి ఘనమైన నివాళులు అర్పించి ఆ కుటుంబంకు జనసేనపార్టీ తరుపున సానుభూతి తెలియజేయడం జరిగింది. ఇప్పటికి అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో ఇది కౌలు రైతుల 4వ ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఇప్పటికయినా రాష్ట్రప్రభుత్వం కళ్ళు తెరిచి నష్టపోయిన ప్రతి ఎకరాకు 35వేల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలి జనసేనపార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## కక్ష సాధింపు పాలన మాని అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వండి : జనసేన నాయకులు



విజయనగరం : ( జనస్వరం ) : వైస్సార్సీపీ ప్రభుత్వం ప్రజలపై కక్ష తీర్చుకొనేందుకు కంకణం కట్టుకుందని విజయనగరం జనసేన పార్టీ నాయకులు శ్రీ ఆదాడ మోహనరావు గారు ఆరోపించారు. గురువారం ఉదయం బాలాజీ జంక్షన్ వద్దనున్న స్థానిక అంబేద్కర్ భవన్ లో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అర్థంకాని పథకాలను పెట్టి కేవలం వైస్సార్సీపీ నాయకులకు, వారి కార్యకర్తలకే కట్టబెడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇంటిపత్రాలు ఇచ్చి కేటాయించిన ఇళ్లకు అర్హులైన పేదలకు చెందకుండా తూట్లు పొడిచారని ఆరోపించారు. గతప్రభుత్వం చేసిన ఇసుక అవకతవకలు, ఇళ్ల కేటాయింపు మొదలగు తప్పిదాలకు ప్రజలు ఎలా గుణపాఠం చెప్పారో ఈ వైస్సార్సీపీ ప్రభుత్వాన్ని కూడా దగ్గరలోనే ప్రజలందరూ బంగాళాఖాతంలో కలిపేందుకు ఎంతోదూరంలో లేదని, ఎందుకంటే సాక్షాత్తు వైస్సార్సీపీ శాసనసభ్యులు, నాయకులు దేశంలోనే అవినీతి పరిపాలన అందిస్తున్న ఏకైక నాయకుడు జగన్ రెడ్డి అని ఒప్పుకుంటున్నారని ఆరోపించారు. ఆఖరికి దళితులు భూములను సైతం ఈ వైస్సార్సీపీ ప్రభుత్వం లాక్కుంటుందని, దళితులకు కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను కూడా మళ్లించి దుర్వినియోగం చేస్తున్నారని, ఆఖరుకు కార్పొరేట్ విద్యను, విదేశీ విద్యను దూరంచేసి దళిత విద్యార్థులకు అన్యాయం జరిగిందని అన్నారు. శ్రామిక రైతు పార్టీ అని చెప్పుకొని రైతులకు కనీసం ఎకరాకు నీరిచ్చేపరిస్థితి లేదని, తుఫానులవలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. మరో జనసేన సీనియర్ నాయకులు, విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ గతంలో ఎన్నికల ప్రచారంలో జగన్మోహన్ రెడ్డి జిల్లా విచ్చేసినప్పుడు మద్యపాన నిషేధం, అర్హులైన పేదలకు ఉచితంగా ఇళ్లు, మొదలగు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల డబ్బుతో పేదలకు అందిస్తున్న ఉచిత ప్రభుత్వ పథకాలకు జగనన్న పేరును వాడుకోవడం తుగ్లక్ పాలనను తలపించేలా ఉందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు దాసరి యోగేష్, వంకర సురేష్, లోపింటి కళ్యాణ్, రాజేంద్రప్రసాద్, అడబాల వెంకటేష్ నాయుడు పాల్గొన్నారు.

## APIIC నిర్వాసితుల సమస్యలు మరియు స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి : విశాఖ 86 వ వార్డు జనసేన నాయకులు



విశాఖపట్నం ( జనస్వరం ) : విశాఖ 86 వ వార్డు జనసేన పార్టీ ఆఫీస్ లో జనసేన, బీజేపీ పార్టీ అభ్యర్థులు APIIC నిర్వాసితుల సమస్యలు మరియు రైల్వే వ్యాగాన్ పరిశ్రమలో స్థానికులకు ఉపాధి కల్పించాలి అని 86 వ వార్డు అభ్యర్థి కదా శ్రీను అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో 88 వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి వభ్బిన జనార్ధన శ్రీకాంత్ గారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారే ముఖ్యమంత్రులు మారారు. కానీ, గాజువాక నియోజకవర్గంలో APIIC భూములు ఇచ్చిన రైతులు స్థితిగతులు మాత్రం మారలేదని, TDP ప్రభుత్వంలో కూడా ఆనాడు గాజువాక MLA పల్ల శ్రీను గారు చివరి 5 నెలలో తూతూమంత్రంగా రైతులను ఓటరుగా మార్చే విధంగా ప్రయత్నం చేశారు గానీ చిత్తశుద్ధితో చేయలేదని అన్నారు. అప్పటి TDP ప్రభుత్వంలాగే ఇప్పుడు YSR ప్రభుత్వం కూడా రైతులను ఒక వోటర్ గానే చూశారు గాని తప్ప వారి సమస్యలను తీర్చడంలో చిత్తశుద్ధితో పాటించడంలేదని పేర్కొంటూ, ప్రస్తుత గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గారిని ఈ యొక్క సమస్యలు పరిష్కారం దిశగా తీసుకుని వెళ్లాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గారు చెప్పినట్లుగా 75 శాతం లోకల్ గా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి మీరు చేస్తున్న చట్టాలు ఎలా ఉన్నాయి. ఉన్నప్పుడు ఒక విధంగా పని చేస్తున్నాయి దయచేసి పరిశ్రమలపై ఒత్తిడి తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించే విధంగా కార్యా ఇరు పార్టీల ఆధ్వర్యంలో రైతులకు న్యాయం చేసే వరకు పోరాడుతామని చెప్పడంతోపాటు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు గాజువాక నియోజకవర్గ MLA గా గెలిపించుకోవడం లో ప్రజలు ఓడిపోయారని, ఆనాడు పవన్ కళ్యాణ్ గారు గాజువాక నియోజకవర్గంలో ఎక్కువ సమస్యలు ఉన్నాయని ఇటువంటి నియోజవర్గంలో నేను MLA గా ప్రాతినిధ్యం వహిస్తే సమస్యలు పరిష్కార దిశలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను చొరవ తీసుకుని లాగా ప్రయత్నం చేయవచ్చును అని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ప్రజలు ఇకపై పని చేసే వారిని గుర్తించి చట్టసభల్లోకి తీసుకుని వెళ్లేలాగా ఆలోచించాలని కోరడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ అభ్యర్థులు లక్కరాజు సోంబాబు, దాడి నూకరాజు (బిజెపి), జనసేన నాయకులు భాస్కర్ రాజు అల్లు రామారావు, ఏవీ రామారావు, సిరసపల్లి కనకరాజు, లాయర్ కళావతి, చిన్న, శివ గణేష్, వెంకట్రావు, శ్రీనివాస రావు గారి కనకరాజు కర్రీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం

( మొదటి పేజీ తరువాయి )

మందికి కాళ్ళు, చేతులు విరిగిపోవడం మరియు కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. HPCL ప్లాంట్ విస్తరణ కారణంగా గత ఎనిమిది నెలలు నుండి సింధియా to మల్కాపురం రోడ్డు మీద ప్రయాణం చేయడం ఒక నరకం గా మారింది. డంపింగ్ లారీలను ప్లాంట్ లోపల శుభ్రపరచకుండా రవాణా మార్గంలోకి నేరుగా రావడం వలన భయంకర దుమ్ము, ధూళి ఎగిసి పడుతుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో జనసేన పార్టీ తరుపున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. HPCL వారు తమ మొండి వైఖరినీ ఇలానే కొనసాగిస్తే రానున్న రోజుల్లో ఈ పోరాటం మరింత బలంగా చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ అభ్యర్థులు చంద్రమౌళి, అంగ ప్రశాంతి, నోట్ల చంద్రకళ, కళ్ల మణిప్రసాద్ మరియు కనకరాజు, రాజు, ప్రకాష్, ధర్మేంద్ర, శ్రీకాంత్, శివ, సత్తిబాబు, మనోహర్, రాధ, గౌతమ్, రమేశ్, తులసి, పరమేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికులకు అండగా క్రియాశీలక సభ్యత్వం : ఎమ్మిగనూర్ ఇంచార్జ్ రేఖగౌడ్



ఎమ్మిగనూరు ( జనస్వరం ) : జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త తీసుకోవాలని పార్టీ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని జనసేనపార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జి రేఖగౌడ్ తెలిపారు. గోనెగండ్ల మండలంలోని అల్వాల గ్రామంలో మంగళవారం రోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా రేఖగౌడ్ మాట్లాడుతూ ప్రతి జనసైనికుని కుటుంబానికి నష్టం జరిగిన కష్ట కాలంలో అండగా నిలిచేందుకు సభ్యత్వం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సభ్యత్వం చేయించుకున్న ప్రతి కార్యకర్తకు 50 వేలు ప్రమాద భీమా 5 లక్షల ఇన్సూరెన్సు పార్టీ కల్పిస్తుందని ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఏకైక పార్టీ జనసేన అని అన్నారు. పార్టీల అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచించే ఈరోజుల్లో భిన్నంగా మిగిలిన పార్టీలు ఆలోచింపచేసేలా కార్యకర్తలు వారి కుటుంబాల క్షేమం కోరుతూ ప్రతి క్రియాశీలక కార్యకర్తలకు ఇన్సూరెన్సు అవకాశం కల్పిస్తున్న ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది జనసేనపార్టీ మాత్రమే అని ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పగలరని అన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రశ్నిస్తూనే ప్రజా సమస్యల సాధనకై సైనికుల్లా ఉద్యమించేందుకు గ్రామాలలో ఉన్న అభిమానులు కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## జనసేన ప్రెస్ నోట్స్

### మాట తప్పను... మడమ తిప్పనని చెప్పి దివిస్ విషయంలో ఏం చేస్తున్నారు?

మాట తప్పను... మడమ తిప్పనని గొప్పగా చెప్పుకొనే ముఖ్యమంత్రి గారు దివిస్ విషయంలో ఎందుకు మాట మార్చాల్సి వచ్చిందో ప్రజలకు వివరించాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు డిమాండ్ చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు బంగాళాఖాతంలో కలిపేస్తాం, గోడలు బద్దలుగొడతాం అని రెచ్చగొట్టి, ఇవాళ చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు.



దివీస్ కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మహిళలను దూషించడం, వారిపై కేసులు పెట్టి వేధించడం, అంబేద్కర్ విగ్రహానికి వేసిన పూలమాలలు లాగేయడం వంటి సంఘటనలు చూస్తుంటే ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని అనిపిస్తోందని అన్నారు. 10 రోజుల్లో దివిస్ అనుమతులు రద్దు చేయకపోతే బాధితుల తరపున పోరాటానికి జనసేన సిద్ధంగా ఉందని హెచ్చరించారు. కాకినాడలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ “విపక్షంలో ఉన్నప్పుడు మీరు చెప్పిన మాటలు ఏంటి? అధికారంలోకి వచ్చాక చేస్తున్న పనులేంటి అనేది ప్రజలు గమనిస్తున్నారు. 2016లో ఈ ప్రాంతంలో ప్రత్యేక సభ పెట్టి అప్పటి ముఖ్యమంత్రి చెంప పగలగొట్టండి అనే భావన వచ్చేలా మాట్లాడారు. అధికారంలోకి వస్తే దివిస్ ఫ్యాక్టరీని బంగాళఖాతంలో కలిపేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అవసరమైతే గోడలు బద్దలు కొడదాం అని ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి అయ్యాక చిన్న రివ్యూ మీటింగ్ పెట్టి ఈ ప్రాంతానికి మంచి పాలసీ తీసుకొస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారు.

దివిస్ కంపెనీ అప్పటి ముఖ్యమంత్రి జేబు సంస్థ అని, అందులో మనుషులు ముఖ్యమంత్రికి సంబంధించిన వారని అన్న మీరు... ఇప్పుడు అవే ప్రశ్నలు ప్రజలు అడుగుతుంటే జవాబు ఎందుకు చెప్పలేకపోతున్నారు. సంస్థ మారలేదు, యాజమాన్యం మారలేదు... మారింది కేవలం ముఖ్యమంత్రి మాత్రమే.

పరిశ్రమ నెలకొల్పడానికి 489 ఎకరాలు కావాలని దివీస్ సంస్థ ప్రతిపాదనలు పంపిస్తే... కేంద్రానికి సిఫార్సు చేసి రాష్ట్ర ప్రభుత్వం 670 ఎకరాలు కేటాయించింది. వేల కోట్ల పెట్టుబడులు, వందలాది మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రజలను మభ్యపెడుతున్నారు. నిజానికి ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన డాక్యుమెంట్లలో కేవలం రూ. 290 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు, 1200 ఉద్యోగాలు ఇస్తున్నట్లు వెల్లడించింది. దివిస్ సంస్థతో సామరస్యంగా సమస్యను సెటిల్ చేసుకోవాలని, 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర మంత్రిగారు చెబుతున్నారు. 75 శాతం అంటే దాదాపు 900 ఉద్యోగాలు. కేవలం 900 ఉద్యోగాల కోసం 700 ఎకరాల భూమిని ఆ సంస్థకు అప్పజెప్పాలా? అలాగే పరిశ్రమ మనుగడ కోసం రోజుకు 6,500 కిలో లీటర్ల నీరు అవసరం అవుతుంది. అలాగే రసాయన వ్యర్థాలుగా 5,600 కిలో లీటర్లు బయటకు వస్తాయి. ఆ నీటిని శుద్ధి చేస్తామని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. తయారు చేసిన మందుల వల్ల వచ్చే మొత్తాన్ని ఖర్చు చేసినా ఆ నీటిని శుద్ధి చేయడానికి చాలదు. వ్యర్థ రసాయనాలు సముద్రంలో చేరడంవల్ల మత్స్య సంపదకు, మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అలాగే ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాల వల్ల స్థానికులు వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఆ సంస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న 160 మందిపై కేసులు పెట్టారు. 63 మందిని రిమాండ్ కు తరలించారు. వారందరిపై కేసులు ఉపసంహరించుకోవాలి. 10 రోజుల్లో దివిస్ సంస్థకు ఇచ్చిన అన్ని అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలి. లేని పక్షంలో అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జనసేన పార్టీ ఉద్యమిస్తుంద”ని చెప్పారు.

దివిస్ సంస్థకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కాకినాడ సబ్ జైలుకు తరలించారు. ఆదివారం నాడు కొత్త పాకలు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో బాధిత కుటుంబాలకు సబ్ జైల్లో ఉన్న వారిని పరామర్శించి, ధైర్యం చెబుతామని శ్రీ నాదెండ్ల మనోహర్ గారు తెలిపారు ఆ మేరకు సోమవారం కాకినాడ సబ్ జైల్ కి వెళ్లి, అరెస్ట్ అయినవారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. దివిస్ కు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని, దివిస్ సంస్థను శాశ్వతంగా మూసి వేయాలని 10 రోజులు గడువు ప్రభుత్వానికి ఇచ్చామని.. ఈలోగా ఇటువంటి నిర్ణయం తీసుకోని పక్షంలో జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇక్కడకు వస్తారని తెలిపారు. సబ్ జైల్లో ఉన్న వారికి అవసరమైన న్యాయ సహాయం చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్య పడవద్దని.. మీరు చేస్తున్న పోరాటం స్ఫూర్తిగా ఉంటుందని చెప్పారు.

### అసెంబ్లీలో చెప్పిన నివర్ నష్టాలకు క్యాబినెట్ లెక్కలకీ పొంతన లేదు

అధికారంలోకి వస్తే రైతు ప్రభుత్వాన్ని స్థాపించి, సంక్షేమ పాలనను అందిస్తామని పాదయాత్రలో వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి గారు ఇవాళ హెలికాప్టర్ పర్యటనలకే పరిమితమవ్వడం విడ్డూరంగా ఉందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు అన్నారు. రైతాంగం పడుతున్న బాధలు, వారి ఆవేదన తెలియాలంటే క్షేత్రస్థాయిలో పర్యటించాలని హితవు పలికారు. అన్నం పెడుతున్న అన్నదాతకు అండగా నిలబడాల్సిన ముఖ్యమంత్రి రైతు వ్యతిరేకిగా మారిపోయారన్నారు.

రాజమండ్రిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ “నివర్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి అండగా నిలబడాలన్న ఆలోచనే ప్రభుత్వానికి లేదు. ఒకే ఏడాదిలో మూడు ప్రకృతి విపత్తులు సంభవించి రైతాంగం పూర్తిగా నష్టపోయింది. మా పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు రైతులను కలిసి వారి కష్టాలు తెలుసుకున్నారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారం గురించి చేసిన డిమాండ్ హేతుబద్ధమైనదే. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పలువురు పెద్దలు 2020 సంవత్సరాన్ని 1977లో వచ్చిన తుపానుతో పోల్చుతున్నారు. ఆ ఏడాది ఏ విధంగా అయితే రైతులు, చిరు వ్యాపారులు నష్టపోయారో... ఈ ఏడాది కూడా అలాగే జరిగిందని చెబుతున్నారు.



నివర్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అనేక గ్రామాలను సందర్శించారు. వందలాది మంది రైతులను పరామర్శించారు. పర్యటనలో భాగంగా కలిసిన ప్రతి రైతు ఈ ఏడాది ఎకరాకు రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు నష్టపోయామని చెప్పారు. ప్రభుత్వం నుంచి కనీసం రూ. 30 వేలు నష్టపరిహారం అందకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వాటన్నింటిని దృష్టిలో పెట్టుకొనే ఎకరాకు రూ. 35 వేల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. అందులో భాగంగా తక్షణ సాయంగా రూ. 10 వేలు ఇవ్వాలని కోరాం. 48 గంటలు గడువు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు సరైన స్పందన రాలేదు. ఆ తరవాత రైతులు, కౌలు రైతుల కోసం ఒక రోజు నిరసన దీక్షను రాష్ట్రవ్యాప్తంగా జనసేన చేపట్టింది.

నివర్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగంలో భరోసా నింపాలన్న ఆలోచనే ప్రభుత్వంలో లేదు. మంత్రులు కాకిలెక్కలు చెబుతూ ప్రజలు, రైతులను మభ్యపెడుతున్నారు. శాసనసభలో వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడుతూ నివర్ తుపాన్ వల్ల 17 లక్షల 32 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రకటించారు. వారం తిరగక ముందే నిన్న జరిగిన కేబినేట్ భేటీలో మంత్రులు లెక్కలను సవరించి ఆ నష్టాన్ని 13 లక్షలకు తగ్గించారు. దాదాపు 4 లక్షల ఎకరాలను నష్టపోయిన జాబితా నుంచి ప్రభుత్వం తప్పించి, వేలాదిమంది రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. మరోవైపు డిసెంబర్ 29న మూడో విడత రైతు భరోసా కింద రెండు వేలు వేస్తున్నాం అని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.13,500 లో కేంద్రం 6 వేలు ఇస్తుంది. అలాగే ఇన్ ఫుట్ సబ్సిడి కింద 40 శాతం కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది. రైతాంగానికి మీరేదో చేసేసినట్లు ప్రజలను ఎందుకు మభ్యపెడుతున్నారు.

ఖరీఫ్ పూర్తిగా నష్టపోయిన రైతాంగం రబీకి సిద్ధమవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు కూడా వేశారు. అధికార యంత్రాంగం, వ్యవసాయ యంత్రాంగం మధ్య సమన్వయం లోపించి ముందుకెళ్తున్న విషయం చాలా మంది రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. గోదావరి జిల్లాలకు రబీ అవసరాలకు 90 టీఎంసీల నీటి అవసరం ఉందని అంచనాలు వేస్తే.. 70 టీఎంసీల కంటే ఎక్కువ ఇవ్వలేమని ఇరిగేషన్ శాఖ అధికారులు లెక్క చూపిస్తున్నారు. ఇలాగైతే 25 శాతం మంది రైతులకు నష్టం కలుగుతుంది. ఎన్నికల ముందు పాదయాత్రలో చేసిన వాగ్ధానం సంపూర్ణ మద్యపాన నిషేధం. ఇప్పుడు చూస్తే మద్యం అమ్మకాల ద్వారా ప్రతి ఏడాది రూ. 17వేల 500 కోట్లు ఆదాయం వస్తోంది. వద్దనుకున్న లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్నే వదులుకొని పంట నష్టపోయిన రైతులకు తక్షణం రూ. 10 వేలు ఇవ్వాలని జనసేన డిమాండ్ చేసింది. ఒక్క ఏడాది మద్యం సంపాదన వదులుకోని పాలకులు తమది సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకోవడం ఎందుకు? 151 మంది ఎమ్మెల్యే ఎందుకు? అందుకే నివర్ తుపాన్, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 28న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు అందిస్తాం. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. రైతులు, రైతు సంఘాలు, జనసైనికులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు కూడా పాల్గొంటారు.

నవరత్నాలతో ప్రజలకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ స్థానిక ప్రజాప్రతినిధులు లబ్ధి పొందే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. నెల్లూరు వంటి ప్రాంతాల్లో చెరువులను చూపించి ఇవే ఇళ్ల స్థలాలు అంటున్నారు. రాజమండ్రిలో రూ. 10 లక్షలు విలువ చేసే భూములను రూ. 60 లక్షలకు కొనుగోలు చేసి సొంత పార్టీ నేతలకు లబ్ధి చేకూర్చుతున్నారు. నిజమైన పేదవాళ్లకు గూడు కల్పించే అంశంపై ఏ రాజకీయ పార్టీ రాజకీయం చేయదు. కానీ ఇలాంటి అవినీతికి పాల్పడితే తప్పకుండా వ్యతిరేకిస్తాం. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని. పార్టీ పరంగా అన్ని ప్రాంతాల నాయకులతో మాట్లాడి తీసుకున్న నిర్ణయం ఇది. దానికే జనసేన పార్టీ కట్టుబడి ఉంద”ని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీ సభ్యులు కందుల దుర్గేష్, ముత్తా శశిధర్, పంతం నానాజీ, పితాని బాలకృష్ణ, పార్టీ నాయకులు మేడా గురుదత్ ప్రసాద్, డి.ఎమ్.అర్.శేఖర్, అత్తి సత్యనారాయణ, మర్రెడ్డి శ్రీనివాస్, వై.శ్రీను, చెరుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

### జనసైనిక్ పంచ్

శ్రీనివాస్ కుసుమపూడి ( అధికార ప్రతినిధి )

- » ఏపీలో మానవ హక్కుల కమీషన్ కు చైర్మన్, సభ్యులు లేకపోవడం, హైకోర్టు ఆదేశాలు చేసి రెండేళ్లయినా అమలు చేయకపోవడం,
- » రాష్ట్ర విభజన జరిగి 6 ఏళ్ళు అయినా ఇంకా ప్రధాన కార్యాలయం హైదరాబాద్ లోనే ఉండడం....మానవ హక్కుల పరిరక్షణ పట్ల ఏపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కాదంటారా?

## 28న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం. రండి.. కదలిరండి : కొలసాని లక్ష్మి పిలుపు



పర్చూరు ( జనస్వరం ) : నివర్ తుఫాన్ బాధితులకు అండగా జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 28వ తేదీన సోమవారం "జై కిసాన్.. ఛలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం రండి.. కదలిరండి అని పర్చూరు నియోజక వర్గ పరిధిలోని నూతలపాడు గ్రామానికి చెందిన జనసేన ఝాన్సీ వీరమహిళ కొలసాని లక్ష్మీ శ్రీనివాసరావు బుధవారం పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనందరికీ ఆకలితీర్చి అన్నంపెట్టే అన్నదాతలు ప్రకృతి విపత్తుల వలన అపార నష్టాలను చవిచూస్తూ అందివచ్చిన పంటలు చేతికి అందకుండా.. ఆర్థికంగా అధఃపాతాళానికి అణగదొక్కబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు సాగుకు చేసిన అప్పులు తీర్చే దారులు లేకుండా ఆపన్నహస్తం కోసం ఎదురుచూసి, విసిగి వేసారిపోయి పలువురు రైతులు అర్థాంతరంగా బలవన్మరణానికి సైతం ఒడిగట్టి తనువులు చాలించారని తెలిపారు. ఈనేపథ్యంలో జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ అన్నదాతలకు జనసేనపార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పదేపదే చెబుతూ "జై కిసాన్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొలసాని లక్ష్మి వివరించారు. ఈనెల 7వతేదీన సైతం జనసేన పార్టీ శ్రేణులంతా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని నిరశిస్తూ "రైతుదీక్ష" పవన్ కళ్యాణ్ తో సహా అందరూ చేపట్టడం, తహశీల్దార్ లకు వినతిపత్రాల్ని అందజేయడం జరిగిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆమె దుయ్యబట్టారు.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ నిరసన ప్రదర్శనలు చేసి, ప్రతి జిల్లాలోని కలెక్టరేట్ లకు జనసైనికులు, రైతులు అందరూ తరలివెళ్లి జిల్లాకలెక్టర్ లకు మరోమారు వినతి పత్రాలను సమర్పించాలన్నారు.

## దుప్పటి ఇద్దాం — చలి నుండి రక్షిద్దాం : జనసేన నాయకులు



కృష్ణా ( జనస్వరం ) : కృష్ణా జిల్లా గుడివాడ జనసేన పార్టీ Rk ఆధ్వర్యంలో చలికాలంలో రోడ్డు పక్కన నిరాశ్రయులుగా ఉన్న వారికి అదే విధంగా వికలాంగులకు, పేదలకు దుప్పట్లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాచర్ల రామకృష్ణ (Rk) మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పేదలకు యాచకులకు, వికలాంగులకు దుప్పట్లు ఇవ్వడం జరిగింది.. అలాగే గుడివాడ పట్టణ ప్రజలు మీ ఇళ్లలో ఉన్న పాత దుప్పట్లు గాని, షర్టర్లు గాని, మీ మోటార్ వెహికల్, కార్లో గాని పెట్టుకుని రోడ్డుమీద నిద్రిస్తున్న యాచకులకు పేదవారికి అందజేయాలని కోరడం జరిగింది. ప్రతి ఒక పౌరుడు సమాజానికి మానవత్వంతో మంచి చేయాలని కోరారు. జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదర్శంగా తీసుకొని సమాజానికి మంచి చేస్తున్నామని తెలియజేసినారు. ఇదివరకు మా యువత ఫ్రెండ్స్ పబ్లు పార్టీలు అంటూ తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చెడు దారిలో ఉండేవాళ్ళం కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ గారి కార్యకర్తలు అయ్యి మాకున్న దానిలో పదిమందికి సహాయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ కరీం, అయ్యప్ప, చరణ్, పండు, జగదీష్, సతీష్, మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## ఫ్రంట్ లైన్ వారియర్స్ కు బకాయి జీతాలు చెల్లించండి : జనసేన నాయకులు



టెక్కలి ( జనస్వరం ) : కోవిడ్-19 అధికంగా ఉన్న సమయంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన నివారణ కేంద్రాల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ నాయకులు కూరాకుల యాదవ్, అట్టాడ శ్రీధర్ లు డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలి మేజర్ పంచాయితీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఈ సందర్భంగా పాల్గొన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని కోవిడ్-19 నివారణ కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన 30 మంది స్థానిక కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నియమించుకుంది. అయితే గత జులై నెల నుంచి నేటి వరకూ ఇవ్వాల్సిన 4 నెలల బకాయిలను మాత్రం చెల్లించకుండా వారిని వదిలేయడం చాలా దారుణమైన చర్యగా వారు దుయ్యబట్టారు. ఎంతో ప్రమాదకరమైన కరోనా సమయంలో తమ సర్వస్వం కాదని రోగులకు సేవలందించిన ఫ్రంట్ లైన్ వారియర్స్ కు తక్షణమే బకాయి జీతాలు చెల్లించి ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని టెక్కలి జనసేన నాయకులు కూరాకుల యాదవ్, అట్టాడ శ్రీధర్ కోరారు.

## జనసేన, బిజెపి పార్టీల ఆధ్వర్యంలో స్నేహలత మరణానికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



అనంతపురం ( జనస్వరం ) : కళ్యాణదుర్గం పట్టణంలో బీజేపీ పార్టీ మరియు జనసేన పార్టీ యాక్షన్ టీం మరియు SYF స్వచ్ఛంధ సంస్థ సంయుక్తంగా ధర్మవరం లో జరిగిన స్నేహలత హత్యను ఖండిస్తూ నిందితులను వెంటనే శిక్షించాలని ఆ అమ్మాయి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దిశా చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కొవ్వుతుల ర్యాలీ చేయడం జరిగింది. అలాగే మహిళల రక్షణ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చాలా నిర్లక్ష్యంగా ఉందని మహిళ హోమ్ మంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు దేవరాజు, శ్రీనివాసులు, చక్క సుబ్రహ్మణ్యం, సుమన్, హనుమంతరాయుడు, రామకృష్ణ, తదితర నాయకులు మరియు జనసేన యాక్షన్ టీం రాజేష్, జాకీర్, ఎర్రిస్వామి, దొనస్వామి, రామలింగ,అరుణ్,హీనయతుల్లా,అంజిమరియు వీరమహిళలు షేక్ తార, పర్వీన్ బేగం, మరియు స్టార్ యూత్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పోరాటానికి మద్దతు తెలిపిన టెక్కలి ఇంచార్జ్ కణితి కిరణ్



టెక్కలి ( జనస్వరం ) : ఉపాధ్యాయ బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్, పోస్టుల బ్లాకింగ్ తొలిగించమని మండల ఫ్యాప్టో పక్షాన ప్రభుత్వానికి నివేదించడానికి విజయవాడలో ప్రజా సంఘాల MLC లు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా టెక్కలిలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్షకు టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ కుమార్ గారు మద్దతు తెలిపి పాత విధానంలోనే ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలని జనసేన పార్టీ తరుపున కోరడం జరిగింది. అలాగే కోవిడ్-19 అధికంగా ఉన్న సమయంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన నివారణ కేంద్రాల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని టెక్కలి ఇంచార్జ్ కణితి కిరణ్ గారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ముడిదాన రాంప్రసాద్, కొత్తూరు హరి, బొడ్డేపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జన స్వరం
అక్షరమే ఆయుధం
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl